ఈనాడు
epaper.eenadu.net

# ఫార్ములా భారత్ పోటీకి రేసింగ్ కారు

## తయారుచేసిన వాసవీ విద్యార్థులు



రేసింగ్ కారుతో విద్యార్థుల బృందం, ఉపాధ్యాయులు

గోల్కొండ, న్యూస్‌టుడే: ప్రపంచీకరణ నేపథ్యంలో పోటీతత్వం పెరిగిపోయింది. దీంతో నేటి విద్యార్థులు సరికొత్త ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు దిశగా అడుగులు వేయడంతో పాటు ఇతర వాటికి విభిన్నంగా ఉండేవిధంగా ప్రయత్నిస్తున్నారు. ముఖ్యంగా ఇంజనీరింగ్ విద్యార్థులు విద్యార్థి దశలోనే తమను తాము ప్రత్యేకంగా నిలుపుకొనేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు. ఈ కోవాలోనే వాసవీ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన మెకానికల్ విద్యార్థులు తమ ప్రత్యేకతను చాటేందుకు రేసింగ్ కారును తయారు చేసి పోటీకి సిద్ధమయ్యారు.

### రేసింగ్‌కారుతో పోటీకి..

కోయంబత్తూర్‌లోని క్యూరోసియమ్ టెక్ అనే ప్రైవేటు సంస్థ ఫార్ములాభారత్ పేరుతో రేసింగ్‌కారు తయారీ పోటీని ఈనెల 21 నుంచి 26 వరకు నిర్వహిస్తోంది. ఇందుకు ఈ సంస్థ అర్హత పోటీని నిర్వహించింది. గత కొద్దిరోజుల క్రితం నిర్వహించిన ఈ అర్హత పోటీలో దేశంలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన 220 విద్యార్థి బృందాలు పోటీపడ్డాయి. 60 బృందాలు రేసింగ్‌కారు తయారీ పోటీకి అర్హత సాధించాయి. దీంట్లో వాసవీ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన మెకానికల్ విభాగం విద్యార్థులు ఉన్నారు. సంస్థ నిర్దేశించిన నియమాలకు లోబడి తక్కువ బరువుతో పాటు తక్కువ ధరలో రేసింగ్ కారును తయారు చేయాల్సి ఉంటుంది. రేసింగ్‌కారులో టాప్‌స్పీడ్, మైలేజీ, అక్సెలరేషన్, బ్రేకింగ్ సిస్టం, ఆటోగ్రాఫ్స్, ఉత్తమ డిజైన్ విభాగాలతో పాటు ఓవర్‌ఆల్ విభాగంలో గెలుపొందిన వారికి బహుమతులు ఉంటాయని కళాశాల మెకానికల్ విభాగాధిపతి రామ్మోన్‌రావు తెలిపారు.

### నాలుగు నెలలు కష్టపడి..

ఫార్ములా భారత్ పోటీ కోసం వాసవీ కళాశాల మెకానికల్ విభాగం విద్యార్థులు గత నాలుగు నెలలు కష్టపడి రూ.2.25లక్షల్లో రేసింగ్ కారుకు రూపం ఇచ్చారు. 38 సభ్యుల గల బృందం రేసింగ్‌కారును తయారు చేసింది. అమెరికాకు చెందిన విల్‌ఉడ్ బ్రేకింగ్ సిస్టంతో పాటు ప్రముఖ టైర్ల తయారీదారు అయిన హుజియర్ టైర్‌లను వాడినట్లు బృందం కెప్టెన్, వైస్ కెప్టెన్ నవీన్, అనిరుధ్‌లు 'న్యూస్‌టుడే'తో అన్నారు. తాము తయారు చేసిన కారు గంటకు 110 కిలోమీటర్ల వేగంతో పాటు 6 సెకండ్లలో 100 స్పీడును అందుకోవడం ప్రత్యేకత అని అన్నారు. సోమవారం విద్యార్థుల బృందం రేసింగ్‌కారుతో కోయంబత్తూర్‌కు తరలివెళ్లింది.

### ఉద్యోగ అవకాశాలు..

పోటీలో ఉత్తమంగా నిలిచే విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు ఉంటాయని విద్యార్థులు తెలిపారు. ప్రముఖ కంపెనీలు పోటీలను వీక్షించి విద్యార్థులకు ఉద్యోగాలు కల్పిస్తాయన్నారు.

### ఆవిష్కరణలకు ప్రోత్సాహం..

విద్యార్థులు తయారు చేసే ఆవిష్కరణలకు వాసవీ కళాశాల యాజమాన్యం సహకారం అందిస్తోంది. వీటి కోసం విద్యార్థులకు సంవత్సరానికి రూ.4లక్షలకు అందజేస్తున్నట్లు కళాశాల సీఈవో బాలాజీ, ప్రిన్సిపాల్ ఎస్వీ రమణ తెలిపారు. విద్యార్థుల ప్రయాణానికి అయ్యే ఖర్చులతో పాటు ఉండేందుకు అయ్యే డబ్బులను విద్యార్థులే భరిస్తున్నారు. పోటీల్లో విద్యార్థులు ఉత్తమంగా నిలిస్తే మొత్తం డబ్బును యాజమాన్యం తిరిగి చెల్లిస్తుందని కళాశాల నిర్వాహకులు తెలిపారు.

Date : 21/01/2020 EditionName : TELANGANA( HYDERABAD, CYBERABAD ) PageNo : Page 05